క్లుప్తంగా

హనుమంతుడి వాహనంపై చెన్నకేశవుడు



శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వామిని పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు

రాజుపాళెం : వెల్లాల గ్రామంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం రాత్రి హనుమంతుడి వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ స్వాములను వైభవంగా ఊరేగించారు. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో స్వాములను ఆశీనులు చేసి పురవీధుల్లో ఊరేగించారు. ముందుగా భక్తులు స్వాములను దర్శించుకుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కానాల విజయల బలరామి రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రామమోహన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గజ వాహనంపై అగస్త్యేశ్వరుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా గంగా రాజ రాజేశ్వరి సమేత అగస్త్యేశ్వర స్వామికి విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేకువజామున స్వామి, అమ్మవార్ల మూల విరాట్‌లకు పంచామృతాభిషేకం, కుంకుమార్చన చేసి ప్రత్యేకంగా అలంకరించారు. గణపతి, నవగ్రహ హోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. సాయంత్రం గంగా రాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను గజ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. శుక్రవారం ఉదయం రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ శంకర్‌బాలాజీ తెలిపారు.

6, 7న గంగమ్మ తిరునాల

మైదుకూరు : మండలంలోని శివపురం వద్ద వెలసిన గంగమ్మకు ఈనెల 6, 7 తేదీల్లో తిరునాలను జరుపనున్నట్లు సర్పంచ్ కొండా భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆలయంలో 6వ తేదీ ప్రత్యేక పూజలు, 7వ తేదీ సేద్యపు ఎద్దులతో బండలాగుడు పోటీలు, మనుషులకు గుండు ఎత్తే పందెం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. 6న రాత్రి పౌరాణిక నాటకాల ప్రదర్శన, 7న మధ్యాహ్నం అన్నప్రసాద వినియోగం ఉంటాయని వివరించారు.

ఘనంగా సీతారాముల కల్యాణం

గోపవరం : మండలంలోని రాచాయపేట కోదండరామస్వామి ఆలయంలో గురువారం ఘనంగా సీతారాముల కల్యాణం నిర్వహించారు. ఆలయంలో మార్చి 24వ తేదీన నూతన ధ్వజస్తంభం ప్రతిష్ఠించారు. ఈనెల 4వ తేదీకి 41వ రోజు పూర్తి కావడంతో ధ్వజస్తంభ మండల ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాముల కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం గ్రామంలోని పురవీధుల గుండా స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.

17న సామాజిక తనిఖీ బహిరంగ సభ

దువ్వూరు : మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం పనులపై ఈనెల 17న సామాజిక బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు ఉపాధి హామీ పథకం ఏపీఓ రామచంద్రారెడ్డి గురువారం తెలిపారు. 2022– 23 ఏడాదికి సంబంధించి ఉపాధి హామీ పథకం ద్వారా జరిగిన పనులపై ఆయా గ్రామాల్లో తనిఖీ బృందాలు ఈనెల 15వ తేదీ వరకు తనిఖీ నిర్వహిస్తారని, అనంతరం 17న ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం పనులపై బహిరంగ సభ నిర్వహిస్తారన్నారు. ఈ సభలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

కలసపాడు : మండలంలోని కొండపేట అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం బద్వేలు ఆర్డీఓ ఆకుల వెంకటరమణ తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. బాలింతలకు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం అందేలా చూడాలని అంగన్‌వాడీ టీచర్‌కు సూచించారు. కొండపేటలో వివాదంగా మారిన పాలకొలను సుదర్శన్‌రెడ్డి ఇంటి స్థలాన్ని పరిశీలించారు. ఈయన వెంట తహసీల్దారు రవీంద్రారెడ్డి, డిప్యూటీ తహసీల్దారు రవిశంకర్, ఎంపీడీఓ మహబూబ్‌బీ తదితరులు పాల్గొన్నారు.

పట్టు పరిశ్రమ అభివృద్ధికి కృషి

మైదుకూరు : పట్టు పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తామని ఉద్యాన శాఖ ప్రభుత్వ సలహాదారుడు సంబటూరు ప్రసాద్ రెడ్డి తెలిపారు. గురువారం వనిపెంట వద్ద ఉన్న పట్టు పరిశ్రమను జిల్లా సెరికల్చర్ అధికారులతో కలసి ఆయన పరిశీలించారు. పరిశ్రమలో పెంచుతున్న మల్బరీ నర్సరీని చాకి పద్ధతులను ఆయన పరిశీలించారు. పరిశ్రమ స్థితిగతులను అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. దసలి పట్టు పెంపకాన్ని చేపట్టాలని సూచించారు. భవిష్యత్తులో రైతు ప్రయోజనాలకు అవసరమైన కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ఇందుకు తన సహకారం అందిస్తానని చెప్పారు. ఆయన వెంట జిల్లా పట్టు పరిశ్రమ అధికారి శ్రీనివాసరెడ్డి, ఎ.రామశివదీక్షిత్, సాంకేతిక అధికారి వెంకటరమణ తదితరులున్నారు.

రైతు భరోసా కేంద్రాలు దేశానికి ఆదర్శం



నూతన భవనాల శిలాఫలకం వద్ద ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, ఆర్టీసీ చైర్మన్ దుగ్గయపల్లె మల్లికార్జునరెడ్డి

ఖాజీపేట : రైతు భరోసా కేంద్రాలు నేడు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని ఇది మన సీఎం జగన్ పాలనాదక్షతకు నిదర్శనమని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. సుంకేసుల గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆర్బీకే, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లీనిక్‌ను రఘురామిరెడ్డి ప్రారంభించారు. అనంతరం భవనాలను ఆయన పరిశీలించారు. పనులు జరిగిన తీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌ను ప్రారంభించడం గొప్ప పరిణామం అని తెలిపారు. గ్రామాల్లోని వారికి వైద్యం అందించడానికి ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లో ఆర్బీకే, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లీనిక్, సచివాలయాలు, ఏర్పాటుతో గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సీఎం జగన్ అనుసరిస్తూ ఆచరిస్తున్నారన్నారు. అంతకుముందు గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు నాయకలు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్ రెడ్డి, ఎంపీపీ అబూబకర్ సిద్దిక్, ఉపమండలాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు అచ్చుకట్ల కరీముల్లా, రాఘవరెడ్డి, సర్పంచ్ యన్నం రాణెమ్మ, వార్డు మెంబర్ చంద్రశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, సచివాలయాల కన్వీనర్ గోపాల్‌రెడ్డితోపాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటింటికి తాగునీటి కొళాయి

మైదుకూరు : మున్సిపాలిటీలోని ఇంటింటికి తాగునీటి కొళాయిని ఏర్పాటు చేయనున్నామని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. గురువారం జరిగిన మైదుకూరు మున్సిపల్ సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరయ్యారు. సమావేశంలో 13వ వార్డు కౌన్సిలర్ వెంకట సుబ్బమ్మ తమ వార్డులో సిమెంటు రోడ్డు నిర్మాణం ఆగిపోయిందని, వెంటనే పూర్తి చేయించాలని ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే పట్టణంలో పైప్‌లైన్ పనులు జరుగుతున్నాయని, పనులు పూర్తయితే సీసీ రోడ్ల నిర్మాణం చేపడతామన్నారు. సమావేశంలో అజెండాలోని అంశాలను పాలకమండలి సభ్యులు తీర్మానించి ఆమోదించారు. మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, కమిషనర్ వై.రంగస్వామి, ఏఈ నిరంజన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు మహబూబ్ షరీఫ్ పాల్గొన్నారు.

రుసుము వసూలు రద్దు చేయండి

మైదుకూరులో తోపుడు బండ్ల వ్యాపారుల నుంచి రుసుము వసూలు చేయడాన్ని రద్దు చేయాలని ఎమ్మెల్యేను కలిసి ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఈ మేరకు వారు వినతిపత్రం అందజేశారు. బస్టాండ్, మార్కెట్ రుసుము వేలం నిర్వహించాల్సిందేనని కమిషనర్ రంగస్వామి ఎమ్మెల్యేకు వివరించారు. వేలం నిర్వహించండి, ఆ సొమ్ము తాను చెల్లిస్తాను, వ్యాపారుల నుంచి వసూలు చేయొద్దని ఎమ్మెల్యే తెలిపారు. అదే విధంగా మైదుకూరులో ఉన్నత విద్యాసంస్థలను ఏర్పాటు చేయాలని, ప్రజలకు పార్కు సౌకర్యం కల్పించాలని ఏఐఎస్ఎఫ్ నాయకుడు పవన్‌కుమార్ ఎమ్మెల్యేను కోరారు.

డ్రైనేజీ నిర్మాణానికి భూమి పూజ

పట్టణంలోని 12వ వార్డులోని ఓ వీధిలో డ్రైనేజీ కాలువ నిర్మాణానికి ఎమ్మెల్యే రఘురామిరెడ్డి గురువారం ఉదయం గడప గడపకు మన ప్రభుత్వంలో ఆ వీధిలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు రూ.15లక్షలతో డ్రైనేజీని నిర్మిస్తున్నట్లు ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ రఘురామిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షరీఫ్, పట్టణాధ్యక్షుడు లింగన్న, కిరణ్మయి, అధికారులు పాల్గొన్నారు.

నేడు తిరుమలకొండస్వామి తిరునాల

కలసపాడు : మండలంలోని మామిళ్ళపల్లె గ్రామ సమీపంలో వెలసిన తిరుమలకొండ స్వామి తిరుణాల శుక్రవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. అలాగే బండలాగుడు పోటీలు, కోలాటం, వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

8 నుంచి వేసవి శిక్షణ శిబిరం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వసంతపేట మున్సిపల్ హైస్కూల్‌లో ఈనెల 8 నుంచి జూన్ 11 వరకు రామేశ్వరం బాలబాలికల గ్రంథాలయం ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఇబ్రహీం సాహెబ్ ఒ ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు ఉదయం 8నుంచి 12 గంటల వరకు విద్యార్థులకు స్టోరీ లిజనింగ్, పుస్తకాలు చదవడం, కథలు చెప్పడం, స్పోకన్ ఇంగ్లిష్, డ్రాయింగ్ తదితర వాటిలో శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మరిన్ని వివరాలకు 9491942221కు సంప్రదించాలని కోరారు.

నేడు సుంకేసుల వీరాంజనేయుడి తిరునాల



కె.సుంకేసులలోని వీరాంజనేయుడి స్వామి గుడి

ఖాజీపేట : సుంకేసుల గ్రామంలో వెలసిన వీరాంజనేయుడి తిరునాల ప్రతి ఏటా ఘనంగా నిర్వహిస్తారు. కోరిన కోర్కెలు తీర్చే దైవంగా స్వామికి పేరు. ఈ ఏడాది తిరునాలను 5న(మొలకల పౌర్ణమి) నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. తిరునాల సందర్భంగా బండలాగుడు పోటీలను నిర్వహించనున్నారు. అలానే రెండెద్దుల పరుగు పందెం పోటీలను నిర్వహించనున్నారు. అలాగే ట్రాక్టర్ ట్యాలీతో రివర్స్ పోటీలు చిన్నపిల్లలకు ఆటల పోటీల నిర్వహిస్తున్నారు. ప్రతి యేడు జరిగే తిరునాలలో ప్రజలు వేల సంఖ్యలో పాల్గొంటారు. భక్తుల రద్దీ దృష్టిలో ఉంచుకొని ఆలయ కమిటీ ఏర్పాట్లను పూర్తి చేసింది. తిరునాల రోజు భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నారు.

ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తే క్షమించం



పుల్లివీడు సచివాలయాన్ని సందర్శించిన నాగార్జునరెడ్డి

పోరుమామిళ్ల : ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తే క్షమించేది లేదని రాష్ట్ర పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ సలహాదారు పి.నాగార్జునరెడ్డి హెచ్చరించారు. మండల రెవెన్యూ సిబ్బంది అవినీతిపై ఇటీవల ఆరోపణలు పత్రికల్లో, సోషల్ మీడియాలో రావడంపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గురువారం పుల్లివీడు, సిద్దవరం, చల్లగిరిగెల సచివాలయాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనతో ప్రజలు గ్రీవెన్‌సెల్‌కు ఉద్యోగులు అందరూ హాజరు కావడంలేదని ముఖ్యంగా వీఆర్వోలు, సర్వేయర్లు సచివాలయాలకు రావడం లేదని తెలిపారు. పుల్లివీడుకు వీఆర్‌ఓ వెంకటేశ్వర్లును రెండు నెలల క్రితం డిప్యుటేషన్‌పై వేశారని ఆయన ఎప్పుడూ సచివాలయానికి రాడని ప్రజలు ఆరోపించారు. వీఆర్‌ఓ ఆనంద్ కూడా సచివాలయానికి రావడం లేదన్నారు. స్పందించిన ఆయన మాట్లాడుతూ అధికారుల వైఖరి వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తున్నదన్నారు. పోరుమామిళ్ల తహసీల్దారుపై ఇటీవల అవినీతి ఆరోపణలు అధికమవడం బాధాకరమన్నారు. తహసీల్దారుపై సమగ్ర విచారణ జరపాలని, ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు చేస్తానని నాగార్జునరెడ్డి తెలిపారు.

అందరి వాడు జగనన్న



సావిశెట్టిపల్లెలో మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

కాశినాయన : పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందరి వాడు అని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ అన్నారు. గురువారం మండలంలోని సావిశెట్టిపల్లె గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారు. మండలస్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల పేరుతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు దోచుకున్నారన్నారు. రూ.30 కోట్లతో లిఫ్ట్‌ఇరిగేషన్ ద్వారా చెరువులకు నీరు అందించేందుకు నిధులు కూడా మంజూరయ్యాయని, త్వరలో పనులు మొదలు పెడతారన్నారు. అందరి మేలు కోరుతున్న జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకులు డి.ఆదిత్యరెడ్డి, ఎంపీడీఓ ముజఫర్‌రహీమ్, సచివాలయాల మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సురేష్, చిన్న శేషయ్య, ప్రభాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నాగసుబ్బారెడ్డి, గురివిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, నరసింహారెడ్డి, స్థానిక కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమం జగనన్నతోనే సాధ్యం

బద్వేలు అర్బన్ : అర్హత ఉన్న ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తూ అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సుధ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 32వ వార్డులో సురేంద్రనగర్, పట్టాభిరామాలయం వీధిలలో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి వార్డులోని ప్రతి గడపను సందర్శించారు. కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరిస్తూ ముందుకు సాగారు.

సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి బద్వేలు మున్సిపాలిటీ అభివృద్ధి కోసం రూ.130 కోట్లు మంజూరు చేశారని ఆమె అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ కన్వీనర్ ఈగయద్దారెడ్డి, వార్డు కౌన్సిలర్ బండి చెన్నయ్య, వార్డు ఇన్‌చార్జిలు చెన్నకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్‌పై ఎప్పుడూ విష ప్రచారమేనా

ప్రొద్దుటూరు : పట్టణంలో నిర్మిస్తున్న కూరగాయల మార్కెట్ నిర్మాణంపై టీడీపీ నియోకవర్గ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆది నుంచి విషప్రచారం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ 4వ వార్డు కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి విమర్శించారు. గురువారం సాయంత్రం తన కార్యాలయం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. కొత్త మార్కెట్‌ను నిర్మించాలని, పాత మార్కెట్‌ను పడగొట్టినప్పుడు ఉద్దేశపూర్వకంగా వ్యాపారుల మధ్య చిచ్చు పెట్టారని పేర్కొన్నారు. వ్యాపారులు వాస్తవాన్ని గ్రహించి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి నిర్ణయాన్ని ఆమోదించారన్నారు. తాత్కాలిక మార్కెట్ నిర్మాణంపై కూడా ప్రవీణ్ విమర్శించారన్నారు. ప్రొద్దుటూరు ప్రాంత మహిళల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే మార్కెట్‌ను నిర్మిస్తున్నారని, అసలు విషయాన్ని గమనించకుండా దురుద్దేశంగా టీడీపీ నేతలు విమర్శించడం తగదన్నారు. ఎంతో నాణ్యతతో మార్కెట్‌ను కేసీపీ సంస్థ నిర్మిస్తోందని, ఏవైనా అభ్యంతరాలు ఉంటేఅధికారులకు తెలపాలన్నారు. హౌస్ బిల్డింగ్ సొసైటీ డైరెక్టర్ కేకే పాల్గొన్నారు.

వైభవంగా నరసింహస్వామి జయంతి



నరసింహస్వామిని పురవీధుల్లో ఊరేగిస్తున్న దృశ్యం

రాజుపాళెం : మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెల్లాల గ్రామంలో గురువారం సాయంత్రం లక్ష్మీనరసింహస్వామి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం పల్లకిలో నరసింహస్వామిని ఆశీనులను చేశారు. అనంతరం గ్రామంలోని పురవీధుల్లో మేళతాళాల మధ్య అంగరంగ వైభవంగా ఊరేగించారు. ఆలయ చైర్మన్ కానాల విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు కానాల బలరామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వెంకటసాయినాథరెడ్డి, కమిటీ సభ్యులు, భక్తులు ప్రత్యేక పూజలు చేసి స్వామివారి పల్లకి సేవలో పాల్గొన్నారు.

నోటిఫికేషన్ విడుదల

కలసపాడు : బద్వేలు నియోజకవర్గంలోని బద్వేలు మున్సిపాలిటీతో పాటు 7 మండలాల్లో ఖాళీగా ఉన్న 28 వలంటరీ పోస్టులకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. బద్వేలు మున్సిపాలిటీ-6, అట్లూరు మండలంలోని వరికుంట్ల-1, మన్నెంవారిపల్లె-1, తంబళ్ళగొంది-1, బి.కోడూరు మండలంలోని బి.కోడూరు-1, ఎస్.పాపనపల్లె-1, మున్నెల్లి-1, బద్వేలు మండలంలోని కోనసముద్రం-2, గోపవరం మండలంలోని ఎస్.రామాపురం-1, టీ.సంద్రపల్లె-1, కలసపాడు మండలంలోని చింతలపల్లె-1, కలసపాడు-2, పుల్లారెడ్డి-1, పోరుమామిళ్ల మండలంలోని కవలకుంట్ల-1, పోరుమామిళ్ల-1, రంగసముద్రం-1, కాశినాయన మండలం రంపాడు-1, ఇటుగుల్లపాడు-1, ఆకులనారాయణపల్లె-1, కత్తెరగండ్ల-1 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. శుక్ర, శనివారాల్లో అర్హులైన వారు దరఖాస్తు చేసుకోండి.

చాపాడు : మండల పరిధిలోని ఐదు గ్రామాలలో ఖాళీగా ఉన్న ఐదు వలంటీర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి శ్రీధర్ నాయుడు తెలిపారు. మండలంలో వివిధ కారణాలతో ఖాళీ అయిన చోట్ల వలంటీర్ల నియామకానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ నెల 5, 6వ తేదీలలో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామని వివరించారు.

నేడు హోల్ క్లాత్ మార్కెట్ ప్రారంభం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు పట్టణంలోని కొర్రపాడు రోడ్డులో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎదురుగా నిర్మించిన శ్రీన్యూ వివేకానంద హోల్‌సేల్ క్లాత్ మార్కెట్‌ను శుక్రవారం ఉదయం ప్రారంభించనున్నారు. 66 షాపింగ్ గదులతో అత్యాధునిక సౌకర్యాలతో ఈ మార్కెట్‌ను నిర్మించారు. ఎకరా 25 సెంట్ల విస్తీర్ణంలో అన్ని సౌకర్యాలతో దీనిని నిర్మించామని వివేకానంద హోల్ సేల్ క్లాత్ మార్కెట్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు.

జనసేనతో కలిసి ప్రజల్లోకి



మాట్లాడుతున్న బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గొర్రె శ్రీనివాసులు

ప్రొద్దుటూరు క్రైం : ఇక నుంచి జనసేనతో కలిసి ప్రజల్లోకి వెళ్తామని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గొర్రెశ్రీనివాసులు తెలిపారు. ఆ పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో బీజేపీ, జనసేన కలిసి ఉమ్మడి కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకుంటామన్నారు.

నియోజకవర్గంలోని 200 బూతుల్లో కమిటీలను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి 4–5 బూతులకు ఒక శక్తి గ్రూపును ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. జనసేన ప్రోగ్రాం కమిటి మెంబర్ జిలాన్‌బాషా మాట్లాడుతూ బీజేపీతో కలిసి జనసేన సమస్యలపై పోరాటం చేస్తుందని తెలిపారు. సమావేశంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు సుబ్రమణ్యం పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని సాయినగర్‌లో నివసిస్తున్న 35 నిరుపేద కుటుంబాలకు గురువారం సాయిబాబా చారిటబుల్ ట్రస్టు సహకారంతో సంఘమిత్ర ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘమిత్ర సంస్థ అధ్యక్షుడు సొద్దల పెంచలయ్య, సంస్థ కో ఆర్డినేటర్లు, డైరెక్టర్లు, సీపీఐ పట్టణ కార్యదర్శి బాబు పాల్గొన్నారు.

నేడు బుద్ధ పౌర్ణమి మహోత్సవం

ప్రొద్దుటూరు : మండలంలోని ఈశ్వర రెడ్డినగర్‌లో ఉన్న స్నేహ సేవా సమితి ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం 5 గంటలకు బుద్ధ పౌర్ణమి మహోత్సవం నిర్వహించనున్నట్లు సేవా సమితి అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి తెలిపారు. బుద్ధుని జీవిత చరిత్ర, బుద్ధ పౌర్ణమి విశిష్టతను వక్తలు వివరిస్తారని ఆయన పేర్కొన్నారు. ఒక గంట సామూహిక విపశ్యనధ్యానం, పౌర్ణమి ధ్యానం చేస్తారని తెలిపారు.

నేడు విగ్రహ ప్రతిష్ట

కలసపాడు : మండలంలోని ఎగువ రామాపురంలో అంకాలపరమేశ్వరీ అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్ట శుక్రవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా బండలాగుడు పోటీలు, అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

నాడు–నేడు పనులు జూన్‌లోపు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి నాగరాజ

గోపవరం : నాడు–నేడు పనులను జూన్‌లోపు పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ తెలిపారు. గురువారం మండల అభివృద్ధి కార్యాలయంలో అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు పనులను విద్యా సంవత్సరం ప్రారంభంలోపు పూర్తి చేయాలని, ఇందుకోసం ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే జగనన్న ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వారం వారం ఇచ్చిన టార్గెట్ పూర్తి చేయాలన్నారు. ఇప్పటి వరకు పనులు మొదలు పెట్టని లబ్ధిదారులతో మాట్లాడి పనులు ప్రారంభించేలా చూడాలన్నారు. అవసరమైతే లబ్ధిదారులు ఐకేపీ ద్వారా రుణాలు ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సమస్యలపై వచ్చిన అర్జీలను నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపాలన్నారు. ఆమోదం వచ్చిన వెంటనే పనులు చేపట్టాలన్నారు. అసంపూర్తిగా ఉన్న ఆర్బీకే, హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సచివాలయాల్లో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించాలని, సచివాలయ సిబ్బంది అందరూ పాలుపంచుకోవాలన్నారు.

అష్టోత్తర శతకుండాత్మక మహాయజ్ఞంలో పాల్గొనాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి 17 వరకు విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించే అష్టోత్తర శతకండాత్మక మహాయజ్ఞంలో ప్రజలు పాల్గొనాలని దేవదాయశాఖ ఏసీ, అగస్త్యేశ్వర స్వామి ఆలయ ఈఓ శంకరబాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత మహాయజ్ఞాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు.